

# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాలు హారి-చందనాలు

### రాయప్రోలు శాంత



అమ్మ ఎంత కమ్మనైన పదం, నిర్వచనం ఇది అని నిర్ణయించలేని అపూర్వమైన పదం. అమ్మంటే అలుపెరుగని అల, అర్థమయినట్టే అనిపిస్తూ అడుగడుగునా ఆశ్చర్యపరిచే అద్భుత వ్యక్తి, మన కష్ట సుఖాలను తనవిగా భావించే నేస్తం, పలుకుల ఉలితో పసివాణ్ణి పరిపూర్ణవ్యక్తిగా మలిచే శిల్పి, ఇలా రాస్తూ పోతే ఎన్నయినా రాయవచ్చు.

మనకి మహాభారతం పంచమ వేదమయితే నాకు మా అమ్మే పంచమ వేదం, ఆమె జీవన విధానమే కావ్యం, ఆవిడ వ్యక్తిత్వమే కొలమానం, ఆమె నిరాడంబరతే ఒక ఉదాహరణ. అమ్మ గురించి రాయాలంటే ఏమని రాయను నేను ముందంటే నేను ముందని జ్ఞాపకాలు తరుముతున్నాయి.

మా అమ్మ పేరు కమలమ్మ ఆ పేరుకి తగ్గట్టే ఎప్పుడు చూసినా చూడగానే గౌరవభావం కలిగించేలా ఉండేది అమ్మ. హైస్కూలు చదువు కూడా పూర్తి చేయలేదు కానీ వ్యక్తిత్వ వికాసానికి చదువే కొలమానం కాదని అమ్మను చూశాకే నాకు అర్థమయ్యింది.

ఉన్నంతలో తృప్తిగా ఉండటం, అందరినీ అభిమానించటం, ఎవరికి ఏ కష్టమొచ్చినా చేతనయిన సహాయం చేయడం, అమ్మలో నాకు కనిపించిన, నేను గమనించిన సుగుణాలు, తెలియనివి ఎన్నుండేవో! ఏ వేళప్పుడు, ఎవరు వచ్చినా, ఆప్యాయంగా పలకరించేది. ఉపచారాలు చేసి ఉపాహారాలు అందించేది. ఆ సుగుణం తాలూకు సౌరభం కాస్త అంటిందేమో మా ఇంటికి ఎవరు వచ్చినా, ఏదో ఒకటి వండిపెట్టనిదే నాకు తోచదు.

అమ్మకు ప్రథమ కోపం ఎక్కువే కానీ దాని పర్యవసానం తీయగా ఉండేది. అడిగింది లేదనకుండా కోరింది కాదనకుండా జరిగేది. అందుకే ఆ కోపాన్ని భరించడానికి సిద్ధపడే వాళ్ళం నేను, తమ్ముడు, చెల్లాయి కూడా.

అమ్మలో నాకు నచ్చిన, నేను వారసత్వంగా తెచ్చుకున్న మరోగుణం వ్యవహారదక్షత, వేలకు వేలు డొనేషన్లు అడుగుతున్న ఆరోజుల్లో ఎవరిని కలిసిందో, ఏం మాట్లాడిందో పైసా ఖర్చులేకుండా నాకు ప్రైవేటు కాలేజీలో సీటు ఇప్పించింది.

నేను ఇష్టపడిన వ్యక్తితో పెళ్ళి జరిపించడానికి తాను ఎంత కష్టపడిందో, చుట్టాలందరితో ఎన్ని మాటలు పడిందో పెళ్ళయిన చాలా ఏళ్ళకు గానీ నాకు తెలియలేదు, అమ్మా చెప్పలేదు. సంతోషమే తప్ప, దుఃఖం పంచడం అమ్మకు తెలియదు మరి.

మా అమ్మాయికి స్కూలు ప్రాజెక్టు పనికి కాస్త సాయం చేసినందుకు అలసిపోయాననుకునే నాకు 'ముగ్గుల పోటీలో పాల్గొనాలి ముగ్గు పిండి కావాల'ని పంతం పడితే, పాలరాయిని దంచి పిండి చేసి ముగ్గులు వేయడానికి పంపిన అమ్మ గుర్తొస్తే సిగ్గనిపిస్తుంది.

"కాస్త కాఫీ కలపవే ఎందుకో నీరసంగ ఉంది ఈవేళ" అంటే "ఫో అమ్మా నేను చేయను" అని విసుక్కున్న నేను, ఎప్పుడు పడుకుంటుందో, రాత్రి తెల్లవారు ఝామునే లేపి వేడి కాఫీ ఇచ్చి చదువుకొమ్మనే అమ్మ! ఏది సామ్యం? ప్రతిఫలం ఆశించని ప్రేమ అమ్మంటే! కాదంటారా?

నేను దుబాయిలో నాలుగేళ్ళు మా వారి ఉద్యోగరీత్యా ఉన్నాను. అప్పుడు అమ్మకి చీరకొనుక్కోమని పంపిన డబ్బులు, నా పేరు మీదే గుడికి దానం చేసిన అమ్మ నిరాడంబరత్వం గుర్తొస్తే ఇప్పటికీ ఆశ్చర్యపడుతుంటాను.

నాకు తెలిసి మా అమ్మకి రెండో మూడో పట్టు చీరలు మాత్రమే ఉండేవి. పెళ్ళయినా , పేరంటమయినా, పండుగైనా, పబ్బమైనా అవే చీరలు. కానీ ఏనాడూ, మా అమ్మ మొహంలో అసంతృప్తిగానీ న్యూనతా భావం కానీ కదలాడేదికాదు. ఆ సింప్లిసిటీ నాకెందుకు అలవడలేదో అర్ధంకాదు.

అమ్మ ఎప్పుడూ సంతోషంగా నిండుకుండలా ఉండేది. ఇదిలేదని, అది కావాలని మా నాన్నను సాధించడంగానీ కించపరచడం గానీ నేనెప్పుడూ చూడలేదు. భార్యాభర్తలు ఒకరికొకరు గౌరవించుకోవడం మాటల్లో కాక చేతల్లో చూపించడం ఎలాగో నేను ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉన్నాను.

ఇలా రాస్తూపోతే ఎన్నయినా ఉన్నాయి. ఈ రోజున నా ప్రవర్తనలో, వ్యక్తిత్వంలో ఏవయినా మంచి లక్షణాలు ఉన్నాయంటే అవి మా అమ్మద్వారా సంక్రమించినవే! ఈ లోకాన తాను లేకున్నా, పూవునంటి ఉండే తావిలా ఆమె వ్యక్తిత్వం నన్ను అంటిపెట్టుకుని ఉండాలని ఆశిస్తూ మా అమ్మకి "మాతృదేవో భవ" అంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

))))

**ఫ్లొరిడా నివాసి ఐన శాంత గారు పది సంవత్సరాలనుండీ అమెరికాలో ఉంటున్నారు. సాహిత్యమంటే అభిమానం. స్టూడెంట్‌గా ఉన్నప్పుడు యువవాణికి కథానికలు రాసేవారు. ఆంధ్ర మహిళాసభకి 81 - 82 ప్రాంతాల్లో కల్చరల్ సెక్రటరీగా ఉండేవారు.**

